క్లుప్తంగా

అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రారంభం

పిడుగురాళ్ల: పట్టణంలోని సుభమస్తు కల్యాణ మండపంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి హాజరయ్యారు.

రెంటచింతల: అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ పథకానికి సంబంధించి మండలంలోని 11 గ్రామాలకు చెందిన 5,878 మంది రైతులు ఎంపికైనట్లు మండల వ్యవసాయాధికారి కట్టా లక్ష్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన రైతులందరికీ వారి బ్యాంక్ ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుందన్నారు.

ప్రభుత్వ పథకాలకు దివ్యాంగులతో లబ్ధి



పిడుగురాళ్ల: దివ్యాంగులకు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రిసోర్స్ పర్సన్ అజిత్ కుమార్ అన్నారు. పట్టణంలోని ఇంటి వద్ద విద్యనభ్యసించే వారి ఇంటికి వెళ్లి వారిని సందర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రతి నెల రూ.6,000 వేలు పింఛన్‌తో పాటు తల్లికి వందనం పథకం వర్తిస్తుందని తెలిపారు. దీనితో పాటు ప్రభుత్వం అందించే పరికరాలను కూడా పొందవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో హరికుమార్ పాల్గొన్నారు.

రెండోరోజు స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం

నాదెండ్ల: ఇర్లపాడు పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో తృతీయ సోపాన్ పరీక్షా శిబిరం శనివారం కొనసాగింది. రెండోరోజు పయనీర్ యాక్టివిటీ, ఎస్టిమేషన్ అండ్ మ్యాపింగ్, టెంట్ పికింగ్, క్యాంప్ క్రాఫ్ట్ తదితర విషయాలపై శిక్షణ నిచ్చారు. ప్రిన్సిపల్ నీరజ్ కుమార్ శ్రీవత్స మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యాలయం నుంచి కనపర్రు వరకూ ఐదు కిలోమీటర్ల నడక, సాయంత్రం 8 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణకు చెందిన 26 విద్యాలయాల స్కౌట్స్ అండ్ గైడ్స్ హాజరయ్యారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

క్రోసూరు: మండలంలోని విప్పర్లలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల్లో చేరడానికి 10 వ తరగతి పాస్ అయిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 5వ తేదీన వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆమె సూచించారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు పూర్తి ఫీజు రూ.4,700, కౌన్సెలింగ్ ఫీజు రూ.1100 చెల్లించాలన్నారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు అయితే రూ.350 చెల్లించాలన్నారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరిన విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంట్ రాదని తెలిపారు. వివరాలకు 9490185104ను సంప్రదించాలని ఆమె సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం నందిగామ కోల్డ్ స్టోరేజ్ వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన గొల్లపల్లి అనిల్ కుమార్ (22) సత్తెనపల్లిలోని ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నాడు. నందిగామలో మృతి చెందిన బంధువు అంత్యక్రియలకు హాజరై, తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. అనిల్ కుమార్ అపస్మారకస్థితికి చేరడంతో సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు దానియేలు, రాహేలు కన్నీటి పర్యంతమయ్యారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ కల్పన నిమిత్తం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 4 నుంచి 8 వరకు సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. టెన్త్ ఆపైన చదువుకుని, 15–45 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని తెలిపారు. కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్ –35, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ –35 పోస్టులకు రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, మార్కుల జాబితా ఫొటోస్టాట్, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు రామకృష్ణారెడ్డి 8074393466లో సంప్రదించాలని తెలిపారు.

అంగన్‌వాడీలకు వేధింపులు తగదు

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మల్లేశ్వరి



అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మల్లేశ్వరి

పిడుగురాళ్ల: అంగన్‌వాడీలకు గుదిబండగా మారిన ఎఫ్‌ఆర్‌ఎష్‌యాప్‌ను వెంటనే రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కార్యదరిశ జి.మల్లేశ్వరి అన్నారు. పట్టణంలోని కన్నెగంటి హనుమంత్ భవనంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు మహాసభ శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి షేక్ హజర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ... అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జూలకల్లులో అంగన్‌వాడీ టీచర్ సునీత కుటుంబ సభ్యులను వేధించటం వలన మనస్తాపానికి గురై ఉద్యోగానికి రాజీనామా చేసిందని చెప్పారు. అదే విధంగా షేక్ ఆసియా బేగం కుటుంబంపై ఆ ఊరు నాయకులు వెళ్లి వారి భర్తను బెదిరిస్తున్నారని, నువ్వు రాజీనామా చేయకపోతే మీ భర్త సంగతి చూస్తామని బెదిరిస్తున్నారని, పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టి వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి రాజకీయ ఒత్తిళ్లకు అంగన్‌వాడీ యూనియన్ భయపడదని, అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపకపోతే త్వరలోనే దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆ విధంగా సమ్మె కాలం డిమాండ్లను అమలు చేయాలని, పని చేయని ఫోన్లను తీసుకొని, 5 జీ ట్యాపులు వెంటనే ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు చెల్లించాలని ఆమె కోరారు. అదే విధంగా ఆగస్టు 4వ తేదీ అంగన్‌వాడీ ప్రాజెక్టు ఆఫీసు వద్ద నిర్వహించనున్న ధర్నాలో అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున్న పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అంగన్‌వాడీ ప్రాజెక్టు నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ హజర, డి.శాంతమణి, ఉపాధ్యక్షురాలుగా షేక్ బుజ్జి, సహాయ కార్యదర్శిగా గద్దం భారతి, కోశాధికారిగా శివరంజని, కమిటీ గౌరవాధ్యక్షులుగా టి.శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హరితాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేయాలి



ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రభుత్వ సలహాదారు జాజి

కారెంపూడి: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యావరణ పరిరక్షణ ప్రేమికులు శనివారం కారెంపూడి వచ్చారు. వారంతా వనాల అభివృద్ధి అడవుల పెంపకం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కొమెర అంకారావు (జాజి)తో కలసి నల్లమల అడవి పరిసరాలలో తిరిగి అడవిలో ఉన్న ప్లాస్టిక్, గాజు సీసాలను ప్లాస్టిక్ కవర్లు ఏరి అడవి బయటకు తీసుకొచ్చారు. సింగరుట్ల లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రం నుంచి గుత్తికొండ బిళం వరకు ఉన్న ప్రాంతంలో సుమారు 15 కిలోమీటర్లు పర్యటించారు. సుమారు మూడు బస్తాల మేర వ్యర్థాలను ఏరి వన్య ప్రాణులకు పక్షులకు ఎలాంటి హాని జరగకుండా శ్రమించారు. తర్వాత వందలాది విత్తన బంతులను ఖాళీగా ఉన్న మైదాన ప్రాంతాలలో వెదజల్లారు. ఈ సందర్భంగా జాజి మాట్లాడుతూ ముఖ్యంగా విద్యా క్షేంద్రాల్లో అలాగే దేవాలయాలలో మంచి వాతావరణం కోసం అందరూ మొక్కలు నాటితే అది సమాజంలో చైతన్యాన్ని రగిలిస్తుందని అందరూ ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులు కృషి చేయాలని, రాష్ట్రాన్ని హరితాంధ్ర ప్రదేశ్‌గా మార్చడంలో స్ఫూర్తి ప్రదాతలు కావాలని కోరారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి



ప్రజాశక్తి నగర్‌లో ప్రజలకు స్మార్ట్ మీటర్ల వలన కలిగే నష్టాన్ని వివరిస్తున్న సీపీఎం నాయకులు

పిడుగురాళ్ల: స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు సంపతి వెంకట కృష్ణ మాట్లాడుతూ... ఇప్పటికే సర్‌చార్జీలు, కస్టమర్ చార్జీలు టూ ఆఫ్ చార్జీలు, బిల్లుల పేరుతో ప్రజలపై భారాలు వేస్తున్నట్లు చెప్పారు. మోదీ ప్రభుత్వం అదానీ కంపెనీకి విద్యుత్‌ను అప్పగించాలని చూస్తుందని, దీనిని ప్రజలు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు, కాలనీ వాసులు భువనేశ్వరి, లక్ష్మి, వాణి, పున్నమ్మ, నాగమల్లేశ్వరి, ప్రమీ, జగదీష్, మహేష్, శ్రావణి, సతీష్ పాల్గొన్నారు.

వార్డు సచివాలయంలో చోరీ



14వ సచివాలయం మెయిన్ డోర్ అద్దాలు పగలగొట్టిన దృశ్యం

పిడుగురాళ్ల: వార్డు సచివాలయం మెయిన్ డోర్ అద్దాలు పగలగొట్టి దొంగతనం చేసిన ఘటన పట్టణంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామ సచివాలయ సిబ్బంది తెలిపిన వివరాలు.. శుక్రవారం సాయంత్రం వార్డు సచివాలయానికి తాళాలు వేసి వెళ్లామని, శనివారం తెల్లవారుజామున వచ్చి చూడగా మెయిన్ డోర్ అద్దాలు పగలగొట్టి ఉండటం గమనించి వెంటనే మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, పోలీసులు పరిశీలించారు. తాళాలు వేసి లోపలకు వెళ్లి చూడగా రెండు కంప్యూటర్ల పింటర్లు దొంగలించుకొని వెళ్లారని, అదే విధంగా వాటర్ ట్యాంక్ కోసం కాపలాగా ఉన్న వాచ్‌మెన్ సైదారావు సెల్ ఫోన్ కూడా దొంగలించుకొని వెళ్లారని వాచ్‌మెన్ తెలిపారు. వెంటనే వాచ్‌మెన్, 14వ సచివాలయం అడ్మిన్ దాసరి అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రైతాంగాన్ని మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

- మొదటి ఏడాది అన్నదాత సుఖీభవకు నిధులు ఇవ్వని ప్రభుత్వం
- కౌలు రైతులకు పథకం అమలుకు విధి విధానాలు విడుదల చేయని ప్రభుత్వం
- ప్రకటనలో ప్రభుత్వ తీరును ఎండగట్టిన కౌలు రైతు సంఘ నాయకులు

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రతి రైతు కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఐదేళ్లలో రూ.1 లక్ష పెట్టుబడి సాయం అందిస్తామని హామీఇచ్చి అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయకుండా రైతాంగాన్ని మోసం చేసిందని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామినేని రామారావు, వై.రాధాకృష్ణ విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు సంబంధం లేకుండా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించి, ఇప్పుడు ఆ నిధులు కలిపి ఇస్తామని చెబుతున్నారని, ఇలా ఇవ్వడం వలన రైతు కుటుంబానికి ఐదేళ్లలో రూ.56 వేలు మాత్రమే దక్కుతాయన్నారు. కూటమి నాయకుల వాగ్దానాల మాటలు కోటలు దాటుతాయని, అమలు చేయబోయే నాటికి చేతలలో చుస్తే గడపకూడా దాటడం లేదని ఎద్దేవా చేశారు. రైతు పక్షపాతి ప్రభుత్వమని చెబుతూనే రైతులను మోసం చేస్తున్నారని కూటమి మోసాలను రైతులు తెలుసుకోవాలన్నారు. ప్రతి కౌలురైతుకు అన్నదాత సఖీభవ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి రాష్ట్రంలో 72 లక్షల మంది కౌలు రైతులు ఉండగా వారిలో 47 లక్షల మందిని మాత్రమే ఎంపిక చేశారని తెలిపారు. వీరికి సంబంధించి ఇంత వరకు విధివిధానాలు ప్రకటించలేదని, కౌలు రైతులను గుర్తించి ఎంతమంది ఉంటే అంతమందికి షరతులు లేకుండా పథకం వర్తింపచేయాలన్నారు. భూమిలేని కౌలు రైతులను గుర్తించి కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేసి అన్నదాత సఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇవ్వాలని, ఈ క్రాప్ నందు పంటల నమోదు చేయాలన్నారు. దేవాలయ భూములు, ఇతర అన్ని రకాల భూములను సాగుచేస్తున్న రైతులకు పెట్టుబడి సహాయం అందించాలన్నారు. వ్యవసాయంలో ప్రభుత్వ సహాయం కొద్ది మందికి ఇచ్చి కొద్ది మందికి ఇవ్వకుంటే అందని రైతులకు అన్యాయం చేసినట్లే అవుతుందన్నారు. ప్రభుత్వ సహాయం అర్హులైన వారందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలలో రైతులకు అన్యాయం జరిగితే కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రైతులను ఏకంచేసి కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నేడు రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: గుంటూరు రోడ్డులోని కే-రిడ్జి పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 3వతేదీ ఆదివారం రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-19 బాలబాలికల ఫ్లోర్ బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్టు పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.కిషోర్‌బాబు శనివారం తెలిపారు. రాష్ట్రంలోని 16 జిల్లాల నుంచి దాదాపు 250 మంది క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొంటారని తెలిపారు. పోటీలలో భాగంగా రాష్ట్రజట్లు ఎంపిక చేస్తారన్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ 4 నుంచి 7వతేదీ వరకు బీహార్‌లో జరగనున్న జాతీయస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిథ్యం వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ జి.బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ పాల్గొన్నారు.

నరసరావుపేట సబ్ జైలర్‌గా అంజయ్య

నరసరావుపేట టౌన్: నరసరావుపేట ప్రత్యేక శ్రేణి ఉపకారాగార పర్యవేక్షణ అధికారిగా సురభి అంజయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన నెల్లూరు ట్రైనింగ్ అకాడమిలో సేవలందించారు. ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా ఆయన నరసరావుపేట సబ్ జైలు పర్యవేక్షణ అధికారిగా బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ సబ్ జైలు పర్యవేక్షణ అధికారిగా సేవలు అందించిన రవికుమార్ యాదవ్ నెల్లూరు శిక్షణ కేంద్రానికి బదిలీపై వెళ్లారు.

ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్

వినుకొండ: పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు, ఉద్యోగులు, చేతివృత్తి పనివారు, గృహిణీలు ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుకోవడానికి వీలు కల్పించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు తెలిపారు. ఓపెన్ స్కూల్లో ద్వారా చదువుకున్న వారు రెగ్యులర్ టెన్త్, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్స్‌తో సమానమని తెలిపారు. ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9490006556ను సంప్రదించాలన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

వినుకొండ: పేదలకు అందాల్సిన 91 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రైస్‌మిల్లులలో శనివారం రాత్రి సివిల్ సప్లయిస్ అధికారులు విస్తృత తనిఖీలు చేశారు. సాయిబాలాజీ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాని స్వాధీనం చేసుకుని 6 ఏ కేసులు నమోదు చేసినట్లు డెప్యూటీ తహసీల్దార్ మురళి తెలిపారు.

8న కనపర్రు కౌలువేలం

నాదెండ్ల: మండలంలోని కనపర్రు గ్రామంలో రాజ్య లింగేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన వ్యవసాయ భూములకు 8వ తేదీన బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ ఈఓ ఎన్. లక్ష్మయ్య తెలిపారు. సర్వే నంబర్ 123లో 14.65, 139లో 1.27 ఎకరాలు వేలం వేయనున్నట్లు చెప్పాన్నారు.

రవికుమార్‌కు సన్మానం



రెంటచింతల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 18 సంవత్సరాల పాటు అంకితభావంతో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించిన రవికుమార్ చేసిన సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ దొప్పలపూడి మేరీ కనకం అన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ పి. అరుణ్ బాబు దేశాల మేరకు శనివారం దాచేపల్లికి బదిలీపై వెళ్తున్న రవికుమార్‌కు స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ వెంకట రమణ, సీనియర్ అసిస్టెంట్ ఎ. నాసరయ్య, ఆర్ఐ మన్‌మోహన్ ప్రసాద్, వీఆర్వోలు పల్లా రామకృష్ణ, పాశం నాసర్‌రెడ్డి, పి.పాపారావు, పి.రేఖ, విఘ్నేష్, పి.లింగయ్య, ఎస్.శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆశ్రమానికి ఆరు సీలింగ్ ఫ్యాన్లు బహూకరణ



రాజుపాలెం: మండలంలోని కొండమోడు పరిధిలోని వీరమ్మ కాలనీలో గల అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమానికి పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఆకి రామాంజనేయులు, ఆకి వెంకటేశ్వర్లు ఆరు సీలింగ్ ఫ్యాన్‌లను శనివారం బహూకరించారు. ఆశ్రమ నిర్వాహకులు గరికపాటి శంకరరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సీపీఐ మహాసభను జయప్రదం చేయాలి

క్రోసూరు: వినుకొండలో ఈనెల 7,8 తేదీల్లో జరిగే సీపీఐ రెండవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం పోస్టర్లు ఆవిష్కరించారు. మహాసభకు సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు హాజరువుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి పసుపులేటి యాదగిరి, నాగరాజు, వేణు పాల్గొన్నారు.

రేపు ధ్వజ స్తంభ ప్రతిష్ట

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం బీసీ కాలనీలో (వడయరాజులు) వేంచేసియున్న శ్రీసీతారామలక్షణ హనుమత్ సమేత దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం పూజ వేడుకలు శనివారం నుంచి ప్రారంభమయాయి. ప్రతిష్టా వేడుకలు ఈనెల 4న ఉదయం 8.07 నిమిషాలకు వేదపండితులు శ్రీమాన్ గుంటూరు శేషాచార్యులు, శ్రీదీవి శ్రీకాంత్ భట్టర్ తన బృందం సభ్యులచే వేడుకలు ఘనంగా నిర్వహించుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. చివరిరోజు భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులందరు ఈకార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు.

చక్కని చేతిరాతతో మెరుగైన ఫలితాలు

శావల్యాపురం: విద్యార్థుల్లో సమాన ప్రతిభ చూపటంతో పాటు మెరుగైన చేతిరాత ఉన్న వారందరు మంచి ఫలితాలు సాధిస్తారని ఎంఈఓ పి.లలితకుమారి అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో చేతిరాత శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చేతిరాతలో ఇచ్చినటువంటి తర్ఫీదును సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా చేతిరాతను సాధన చేస్తూ మెరుగైన పలితాలు సాధించాలన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థులకు నేర్పించి ప్రతి విద్యార్థి అందమైన చేతిరాత కల్గి ఉండేలా ప్రోత్సహించాలన్నారు. పదో తరగతి చదువుతున్న 75 మంది విద్యార్థులతో ఉపాధ్యాయులకు ఇంగ్లీష్‌లో హ్యాండ్ రైటింగ్‌లో ఉత్తమ శిక్షణ ఇవ్వటం అభినందనీయమన్నారు. అనంతరం శిక్షణ తరగతులు ఇచ్చినటువంటి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామ మోహన్‌రావు, కార్యక్రమ నిర్వాహణకర్త బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు, టి.శ్రీనివాస రావు, చేపూరి రమేష్, సత్యనారాయణలను పూలమాలలు దుశ్శాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డపాటి విజయలక్ష్మి, గురుబాబు, కోటేశ్వరరావు, ఆదాంఖాన్ పాల్గొన్నారు.

చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం

డీఎస్పీ జగదీష్



పురస్కారాలు అందిస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ ఆకుల సత్యనారాయణ

గురజాల: చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు చేస్తున్న సేవలు ఎనలేనివని డీఎస్పీ జగదీష్ అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఉదయం సీనియర్ వైద్యుడు చల్లగుండ్ల శ్రీరామమూర్తి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పురస్కారాలు అందించారు. ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో పల్నాడు ప్రాంతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. వైద్యుడు చల్లగుండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పల్నాడు పాతంలో విద్యా వైద్యం పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలనే లక్ష్యంతో ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో చల్లగుండ్ల శ్రీకాంత్, చల్లగుండ్ల శ్రీనివాస్,ఇంచార్జీ ఎంఈఓ ఆకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీలో హైయర్ బస్సు డ్రైవర్లకు అవకాశం కల్పించండి



ఆర్టీసీ డిపో వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న హైయర్ బస్సు డ్రైవర్లు

మాచర్ల రూరల్: నూతనంగా ఏపీఎస్‌ఆర్టీసీ డ్రైవర్ ఉద్యోగాల ఎంపికలో హైయర్ బస్సు డ్రైవర్లకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలని సీఐటీయూ ఏరియా కార్యదర్శి బండ్ల మహేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డిపో వద్ద హైయర్ బస్సు డ్రైవర్లు చేస్తున్న ఆందోళనలో ఆయన మాట్లాడారు. స్థానిక ఆర్టీసీ డిపోలో 25 బస్సులు నడుస్తున్నాయని, అందులో 56 మంది వరకు డ్రైవర్లు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారని ప్రభుత్వం చేపట్టబోయే ఉద్యోగ నియామకాల్లో మొదటగా ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు నేపథ్యంలో అదనపు డ్రైవర్లను తీసుకునేందుకు డీఎం ప్రకటన ఇచ్చారని, ఎన్నో ఏళ్ళుగా ఆర్టీసీలోనే హైయర్ బస్సు డ్రైవర్లుగా పనిచేస్తున్న తమకు అవకాశం కల్పించాలని వారు విధులను బహిష్కరించి డిపో వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బండ్ల మహేష్ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామితో చర్చించి హైయర్ బస్సు డ్రైవర్‌లకు ప్రాధాన్యం కల్పించాలని కోరిన నేపథ్యంలో ఆయన వారికి స్పష్టమైన హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేముల వెంకటరావు, హైయర్ బస్సు డ్రైవర్ల సంఘం నాయకులు మురళీ కృష్ణ, నాగరాజు, మ ణిరెడ్డి, వెంకయ్య, కృష్ణా నాయక్ పాల్గొన్నారు.

పీఎస్‌ఆర్ కంటి వైద్యశాల వైద్యుల సేవలు ఎనలేనివి



వైద్య శిబిరంలో వైద్య సిబ్బందిని అభినందిస్తున్న చైర్మన్ కృష్ణయ్య, మురహరిరావు

మాచర్ల రూరల్: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో అత్యాధునిక వసతులతో పీఎస్‌ఆర్ ఆంజనేయులు- మీనాక్షి కంటి వైద్యశాల నిర్మించటమే కాకుండా వేలాది మందికి ఉచితంగా వైద్య సేవలందిస్తున్న వైద్యుల కృషి అభినందనీయమని హాస్పిటల్ చైర్మన్ చిరుమామిళ్ల కృష్ణయ్య అన్నారు. శనివారం పట్టణంలోని కంటి ఆస్పత్రిలో జూలై నెలలో ఎన్నడూ లేని విధంగా 1007 మందికి కంటి ఆపరేషన్లు చేసిన సందర్భంగా వైద్యులు, సిబ్బందిని అభినందించి మాట్లాడారు. ఎన్‌ఆర్‌ఐ పీఎస్‌ఆర్ ఆంజనేయులు- మీనాక్షి దంపతులు పేద ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలందించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయలు వెచ్చించి ఈ ప్రాంత ప్రజలకు చేస్తున్న సేవలు మరువలేనివని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ మురహరిరావు, డైరెక్టర్లు కర్నాటి శ్రీనివాసరావు, చెరుకూరి నరసింహారావు, మారేపల్లి లక్ష్మీనారాయణ, శేరెడ్డి గోపిరెడ్డి, కేసీపీ వెల్ఫేర్ బండారుపల్లి వెంకటేశ్వరరావు, వైద్యులు యశ్వంత్, మౌనిష పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో తల్లిపాల వారోత్సవాలు

యడ్లపాడు: అమ్మపాలు అమృతంతో సమానమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శనివారం యడ్లపాడుకు విచ్చేసిన ఆయన గ్రామంలోని 9 అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తల్లిపాల ప్రయోజనాలు తెలిపే పోస్టర్‌ను ఆవిష్కరించి, గర్భిణులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమలతా దేవి, ఈవోపీఆర్డీ షేక్ జాకీర్ హుస్సేన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.వెంకట రమణ, ఎం.అరుణ కుమారి, ఎం.కోకిలమారుతి, ఎస్.సరోజిని, కె. సుజాత, ఆర్.పరిమళ, కె.రాజ్యలక్ష్మి, ఎం మల్లేశ్వరీ, జనసేన నాయకులు రాజారమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లింగారావుపాలెంలో...

యడ్లపాడు: తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారమని అంగన్‌వాడీ కార్యకర్త టి.పున్నమ్మ చెప్పారు. మండలంలోని లింగారావుపాలెం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సాహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకాగా పనిచేస్తాయని, పుట్టిన గంటలోపే తల్లిపాలు తాగించాలని సూచించారు. మొదటి ఆరునెలలు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారమని, ఇది మేధస్సు అభివృద్ధికి తోడ్పడటంతో పాటు తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా కాపాడుతుందని వివరించారు. ముఖ్యంగా తల్లిపాలు తల్లి-బిడ్డల అనుబంధాన్ని బలపరుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఏనుగుపాలెంలో...

వినుకొండ: మండలంలోని ఏనుగుపాలెంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలన్నారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని, తల్లులకు వివరించడం జరిగింది. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని తల్లులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దేవి, కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: మండలంలోని గరికపాడు, పమిడిపాడు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేశారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్ వైజర్ షేక్ మస్తాన్ బీ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు త్రాగించాలని సూచించారు. ముర్రుపాలు బిడ్డ ఆరోగ్యానికి మొదటి టీకా వంటిదని తెలియజేశారు. శిశు ఆరోగ్యానికి తల్లిపాలు శ్రేయస్కరమని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు శంకరనారాయణ వైద్య సిబ్బంది అంగన్‌వాడి కార్యకర్తలు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.